# నాకూ కావాలి!



అది జూన్ నెల. మండువేసవి. బహుశా సాయంత్రం ఆరో, ఆరున్నరో అయి ఉంటుంది. ఇంకా వేడి గాడ్పు వీస్తూనే ఉంది. ఆ రోజు ఆదివారం. పబ్లిక్ గార్డెన్సులో పక్క పక్కగా కూర్చున్నారు యశోద, రాధాకృష్ణ. జంటలు జంటలుగా జనం ఎవరి హడావుడిలో వాళ్లు ఉన్నారు. నిండుగా నిండిపోయి ఉంది పబ్లిక్ గార్డెన్సు. రాధాకృష్ణమాత్రం చేతులు వెనక్కు పెట్టి వాలుగా దాన్ని ఆనుకుని ఒరిగి కూర్చున్నాడు. అతని దృష్టికి పరిసరాలు అనటమే లేదు. రెప్ప వాల్చకుండా యశోదనే చూస్తున్నాడు. ఆమె సన్నిధి అతనికి విపరీతమైన ప్రశాంతి కలిగిస్తూంది. ఇద్దరూ అక్కడికి వచ్చి కూర్చుని అరగంటకు పైనే అయింది. కాని, ఇద్దరిలో ఎవరూ మాట్లాడటం లేదు. అయిదు సంవత్సరాలనుంచి ఇద్దరూ ప్రాణ స్నేహితులే. ఒకే ఆఫీసులో కలిసి పని చేస్తున్నారు. ఒకరిని ఒకరు బాగా అర్థం చేసుకున్నా ఎప్పుడూ అతి సన్నిహితులు కాలేదు. అతను ఆఫీసరు. ఆమె అతని కింద అసిస్టెంటు.

ఆరు నెల్ల క్రితం రాధాకృష్ణ అడిగిన ప్రశ్నకు ఇంత వరకు యశోద సమాధానం చెప్పనేలేదు. ప్రతిరోజూ ఇద్దరూ కలుసుకొంటూనే ఉన్నారు. ఆమె సమాధానానికై హృదయాన్ని ఆశతో నింపుకొని అతను ఎదురు చూస్తూనే ఉన్నాడు. కాని, యశోద రేపు, రేపు అంటూనే దాటించేస్తూంది. రాధాకృష్ణను చూడగానే ఆమె హృదయం ఎంతటి అనురాగంతో నిండి పొంగి పొరలుతుందో దానికి రెట్టింపు నిరాశ ఆమె గుండెల్ని పిండి పిండిగా చేసేస్తూంది. తన ఈ పరిస్థితిని తెలుసుకొంటే రాధాకృష్ణ తనకు శాశ్వతంగా దూరమైపోతాడనే భయం ఆమె నొసరాన్ని పట్టి పీడిస్తూంది. ఎప్పటికైనా తన సమస్యలను అతనికి చెప్పవలసిందే. ఆమెకు అంత శక్తి కాని, సామర్థ్యం కాని లేవు. ఆమె మనస్సులోని విషయం బహిర్గతం కావాలంటే ఏదైనా విపరీత శక్తి దానికి దోహదం కలిగించాలి. అప్పుడే ఆమె నిగ్రహం కోల్పోయి తన బాధా పరితప్త హృదయంనుంచి దాన్ని బయట పెట్ట గలుగుతుంది.

రాధాకృష్ణ నెమ్మదిగా కాస్త లేచి యశోదవైపు తిరిగాడు. "యశూ! చెప్పవూ?" అని ఆమె కన్నుల్లోకి చూడసాగాడు. అతని హృదయం ఆశతో అనురాగంతో నిండిపోయి ఉంది. ఆనందంతో మెరిసి పోతున్న అతని కన్నులే ఆ విషయాన్ని చాటుతున్నాయి. రాధాకృష్ణ చక్కని భారీ మనిషి. మెండుగా ఉండి ఉండి మెరిసే అతని కళ్లలో ఏదో చెప్పలేని ఆకర్షణతో పాటు పట్టుదల, ఓర్పు కనిపిస్తాయి. నెమ్మదిగా మోచేతులమీద లేచి యశోదవైపు తిరిగాడు. నిదానంగా గడ్డిపోచలను గిల్లిపోస్తున్న ఆమె చేతిమీద చటుక్కున

ఆంధ్ర ప్రభ

సచిత్ర వారపత్రిక

*1965*, నవంబరు *1* నుంచి

కొత్త ప్రకటన రేట్లు

**కాజువల్ :** కాలం సెం. మీ. 1 కి 7—50

**కంట్రాక్టు:** కాలం సెం. మీ. 1 కి రు. 6-80

(250 సెం. మీ. లు, ఆపైన)

(ప్రకటనకు కనీస స్థలం సెం. కాలం—

5 సెం. మీ. లు)

అట్ట పేజీలు

4 వ పేజీ-రెండు రంగులు

**కాజువల్ :** ప్రకటన 1 కి రు. 1100/—

**కంట్రాక్టు :** ప్రకటన 1 కి రు. 950/—

(కనీసం 6 ప్రకటనలు)

2 వ పేజీ, 3 వ పేజీ—

ఒక రంగు

**కాజువల్ :** ప్రకటన 1 కి రు 700/—

**కంట్రాక్టు :** ప్రకటన 1 కి రు. 600/—

(కనీసం 6 ప్రకటనలు

కొలతలు :

కాలం వెడల్పు 5 సెం. మీ.

కాలం నిడివి 23 సెం. మీ.

పేజీకి 3 కాలంలు

*ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:*

అడ్వర్టయిజ్‌మెంట్ మానేజర్,

ఆంధ్రప్రభ

సచిత్ర వారపత్రిక

ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు- 2

# నాకూ కావాలి

పడిన లోకేశ్వరిది కాస్త చాదస్తపు స్వభావం. వయస్సుతో పాటూ అదీ ఎక్కువ అవుతున్నదే తప్ప తగ్గటం మాత్రం లేదు. ఆచార వ్యవహారాల్లో ఆవిడకు కాస్త పట్టింపు. అందుకే కూతురివంక, ఆమె ముస్తాబువంక ఎగాదిగా చూసింది. ఆ వేషం, ఆ రెండు జడలు ఆవిడకు అసలు నచ్చవు. అయినా భర్త ఎదురుగా ఎప్పుడూ కూతురిని ఏమీ అనదు. ఒకవేళ ఓర్చుకోలేక ఏమైనా అంటే ఆయన బాగా చీవాట్లు వేసి తననూ, తన పాత పద్ధతులనూ తెగ తిట్టిపోస్తారని ఆవిడ భయం. అందుకే ముభావంగా తన అయిష్టం లోలోపలే దిగమింగుకుంది.

తండ్రీ కూతుళ్లలో ఎవరైనా మాట్లాడతారేమోనని ఆవిడ రెండు క్షణాలు ఆశగా ఎదురుచూసింది. కాని, ఎవరి ఆలోచనలలో వాళ్లు మునిగిపోయి ఉన్నారు. ఆవిడే కలగచేసుకొని, "అయితే అమ్మాయీ! నువ్వు మామయ్యను చేసుకోనట్టేనా?" అంది. ఆ మాట వినగానే తండ్రీ కూతుళ్లు ఇద్దరూ ఉలుక్కుమన్నారు. "ఓహో! ఈవిడగారు ఇంకా నీమీద ఆశ పెట్టుకొని కూర్చున్నట్టుందే,అమ్మాయీ!" అన్నారు కాస్త హేళనగా. యశోద తండ్రివైపు చూసి మెల్లిగా నవ్వింది. అయినా ఆమె కన్నుల్లోని బాధ, అవమానం లీలగా ఆయనకు కనిపిస్తూనే ఉన్నాయి. నెమ్మదిగా అన్నారు: "చూడు, లోకేశ్వరీ! నీకు తమ్ముడనే ప్రేమ తప్ప, అతని గుణగణాలు చూడటం లేదు. బి. ఎ. చదివి, సంపాదనపరురాలై బంగారు బొమ్మలా కంటికి ఇంటికి నిండుగా ఉన్న యశోద నాకే కాదు, నీకూ కూతురే! దాని బాగోగులు నువ్వూ ఆలోచించాలి. చదువు లేదు సరే! రూపానికి తోడు గుణాలైనా మనం భరించగలమా? లోకంలో ఎన్ని దుర్గుణాలు ఉన్నాయో అన్నీ మీ తమ్ముణ్ణే చుట్టుకొనే ఉన్నాయి. అలాటివాడు యశోదను చేసుకోటానికి ఇష్టపడుతున్నాడంటే నీకోసం, నా కోసం కాదు. దాని అందం, డబ్బు చూసి. వాణ్ణి పెళ్లిచేసుకున్నాక ఏర్పడే కష్టాలు నీవు ఊహించడం లేదు. అసలు మీ తమ్ముడి మూలకంగానే ప్రభాకరం అలానాశనం అయ్యాడు. జులాయి వెధవలా తిరుగుతూ ఎంత చెడిపోయాడో నీకు ఏమైనా తెలుసా?"

చెడిపోయిన కొడుకును తలుచుకోగానే రామనాథంగారికి చెప్పలేని బాధ కలిగింది. అయినా దాన్ని లోలోపలే అణుచుకొంటూ తిరిగి భార్యతో, "నీవు ఇటువంటి ఆశలు పెట్టుకోకు. ఇక వా డు మన ఇంటి గుమ్మం ఎక్కడానికి కూడా వీలులేదు.తెలిసిందా?" అన్నారు ఆజ్ఞాపించినట్టుగా. ఆయన ముఖము, కళ్లు ఎర్రబడిపోయాయి. మనిషి ఆపాదమస్తకము వణికిపోసాగారు. యశోద తండ్రి గుండెల్ని నెమ్మదిగా రాస్తూ, "మీ మాట నిజం, నాన్నా! అమ్మకు మనం చెబితే అర్థం కాదు. మామయ్యను పెళ్లాడితే ఎలాటి కష్టాలు వస్తాయో అమ్మకూ తెలుసు. కానీ, ఇరుగు పొరుగు మాటలతో మగరాయుడిలా ఉద్యోగం చేసే తన కూతుర్ని ఎవడూ పెండ్లాడడనే భయం కలిగింది. అందుకే ఎలాగైనా సరే కూతురికి పెండ్లిచేసేస్తే చాలని ఆవిడ ఊహ..." అంది నవ్వుతూ. వెంటనే లోకేశ్వరి అందుకుని, "అవును. పొద్దున్న పోయి సాయంకాలం వచ్చే నీకు, ఇరవైనాలుగు గంటలూ రోగంతో తీసుకొనే మీ నాన్నకు ఎలా తెలుస్తుంది లోకులు ఏమనుకుంటున్నారో?" అంది. "ఏమనుకుంటున్నారేమిటి?" అంది కుతూహలంగా యశోద. "అబ్బా! ఇప్పుడు ఆ గొడవలన్నీ ఏకరువు పెట్టకు, నాకు తల నొప్పిగా ఉంది" అన్నారు రామనాథంగారు. లోకుల వ్యాఖ్యానాలు ఎంత అసమంజసంగాను, అసభ్యకరంగాను ఉంటాయో రామనాథంగారికి తెలుసు. అమాయికురాలైన తన భార్య వాటిని వద్దు వద్దన్నా చెప్పి తీరుతుంది. అతి సున్నితమైన మనస్సు తన కూతురిది. ఆమె వాటిని విని తట్టుకోలేదని ఆయనకు తెలుసు. "చూడు, తల్లీ! రెండు బత్తాయి పళ్లరసం తీసి తీసుకువస్తావా? నోరెండిపోతూంది దాహంతో" అన్నారు.

కాఫీ తాగి ఇంకా పది నిమిషాలైనా కాలేదు. కానీ, నోరెండిపోయే దాహం ఆయనకు ఎందుకు కలిగిందో ఆమాత్రం ఊహించకపోలేదు యశోద. తల్లి మాటలు తాను వినటం ఆయనకు ఇష్టంలేదు. "అలాగే, నాన్నా!" అంటూ యశోద లేచి వెళ్లిపోయింది.

రెండు క్షణాలకు మళ్లా ప్రారంభించింది లోకేశ్వరి. "మీరు మరీ అలా పట్టనట్టుగా ఉంటే ఎలా? పాతికేళ్లు దాటితే పెండ్లికావటం ఎంత కష్టమో, తెలుసా? అలా మగవాళ్లతో కలిసి ఉద్యోగం, ఉద్యోగం అంటూ తిరిగే ఈ పిల్లను ఎవరు పెళ్లాడతారు? అసలు బి. ఎ. చదివిందని తెలిస్తేనే పెళ్లి కాదుట. ఇంక ఇలా ఉద్యోగాలు, ఊళ్లేలడాలు ఉంటే అసలు పెళ్లికాదంది ఆ కామమ్మగారు మొన్న."

"ఆవిడ సలహా దేనికి నీకు! మన ఇంటి పరిస్థితిని బట్టి అది ఉద్యోగం చెయ్యవలసి వచ్చింది. ఈ లేనిపోని కబుర్లు విని మనస్సు పాడుచేసుకోకు. ఆ రోజు రావాలి. దాని గుణాలు నచ్చి కోరివాడు వచ్చినప్పుడే పెళ్లి చేస్తాను. అంతవరకూ హాయిగా, దర్జాగా ఉద్యోగం చేసుకుంటుంది" అన్నారాయన ధీమాగా. ఆ ధీమాతో ఆమెకు ఆపుకోలేని కోపం వచ్చింది. "అయితే ముప్ఫయి ఏళ్ల ముసలి పెండ్లికూతురు అవుతుందా మీ అమ్మాయి? దానికి ఒక చెల్లెలు ఉందన్న విషయం తెలుసా!" అన్నది కాస్త విసురుగా. "దానికి ముందు కుదిరితే దానికే చేస్తాను" అన్నారాయన, ఆ మాటతో ఆవిడ మండిపోయింది. "మీ పెద్దమ్మాయికి ఎందుకు పెళ్లిచెయ్యరు అంటే ఏమి చెబుతారు? ఏ కిరస్తానీనో ప్రేమించి ఉంటుంది. చెల్లెలు పెళ్లి అవనిచ్చి గప్‌చుప్‌గా తనూ కానిచ్చేస్తుంది, అనలేదూ వాళ్ల రమను? మనపిల్లనూ అలాగే అంటారు" అంది బాగా దిగులుపడిపోతూ. తన పిల్లలు దుర్మార్గులు అంటే ఏ తల్లీ సహించలేదని ఆయనకు తెలుసు. చదువుకున్నా చదువుకోకపోయినా వివాహం ఎప్పుడూ సమస్యగానే ఉన్నది. ధనంతో మానవత్వాన్ని కొలిచే ఈ మనుష్యుల మనస్సులు మారాలి. దాన్ని కాలమే మార్చాలి అనుకున్నారు క్షణం. దిగులుగా కూర్చున్న భార్యను చూస్తే ఆయనకు జాలివేసింది.

"ఆ రోజు రావాలి, లోకేశ్వరీ! నువ్వూ నేనూ ఎంత ప్రయత్నించినా మన చేతుల్లో ఏమీ లేదు!" అన్నారు వేదాంతధోరణిలో. పక్కగదిలోనే బత్తాయిరసంతీస్తున్న

యశోదకు తల్లిదండ్రుల సంభాషణ పూర్తిగా విని పిస్తూనే ఉంది. ఎన్ని ఉన్నా ఆడది ఆడదే. ఏ వయస్సులో జరగవలసింది ఆ వయస్సులో జరిగి తీరాలి. తోడూ రక్షకుడూ ఏర్పడితే కాని తలిదండ్రుల భారం తీరదు. తల్లిని ఇంకా కూర్చోనిస్తే తండ్రి గుండె దడ మళ్లా రావచ్చనే ఉద్దేశంతో బయటికి వచ్చి, "అమ్మా, వంటయిందా? నేను ఆఫీసుకు పోవద్దూ?" అంది. "వంటయింది. రా, మరి" అంటూ లేచి నెమ్మదిగా వంటింట్లోకి వెళ్లిపోయింది లోకేశ్వరి.

తండ్రికి బత్తాయి రసం ఇచ్చి తనూ వంటింట్లోకి వెళ్లి పీటవేసుకు కూర్చుంది. తల్లి కంచంవేసి, మంచి నీళ్లు పెట్టింది. చిన్న గిన్నెతో తోటకూర పులుసు తెచ్చి కంచం పక్కగా పెట్టింది. కంచంలో అన్నం వడ్డించి నెయ్యివేసింది. యశోద పులుసు కలుపుకొని అన్నం తినడం ప్రారంభించింది. "అమ్మా! నాన్నకు కూడా పులుసు ఒకటేనా? ఏదైనా కూర చెయ్యలేక పోయావా? ఎలా తింటారు? అయినా బలమైన ఆహారం ఉంటే కాని తొందరగా కోలుకోలేరని డాక్టరుగారు అన్నారు" అంది. తల్లి రెండు క్షణాలు ఏమీ మాట్లాడలేదు. తరవాత అంది: "కూరలూ పళ్లూ కొనమని నిన్ననే కదూ నీకు పది రూపాయలు ఇచ్చాను?" లోకేశ్వరికి ఒక్కసారి కోపం వచ్చింది. ఇందాకటినుంచీ ఆవిడ గుండెల్లో రగులుతున్న కోపం ఒక్కసారి భగ్గుమంది. "అవును. నీ సంపాదన అనేగా ఈ అరాలు! ఏంచేశావు? ఏంచేశావు? అంటూ పదిసార్లు రెట్టిస్తున్నావు. నీ పోరూ, మీ నాన్న పోరూ పడలేకే వాడు ఇంటికి కూడా రావడం మానేశాడు. నిన్న వచ్చి ఏదో ఉద్యోగం ఖాళీగా ఉంది అక్కడికి వెళ్లటానికి ఖర్చుకు కావాలని ఆ పది రూపాయలు పట్టుకొని పోయాడు."

ఒక్కసారి ఆవిడ కళ్లు ఆనందంతో మెరిశాయి. "కుర్ర నాగన్న ఎంత సంబరపడ్డాడో ఆ పది రూపాయలూ చూచి" అంటూన్న తల్లిమాటలు ఇంక యశోదకు వినపడలేదు. తను నెలరోజులు కష్టపడి సంపాదించినడబ్బు జల్సాగా ఖర్చుపెట్టటానికి పోయింది. ఇంత చెడిపోయిన కొడుకును గురించి తల్లి ఏమీ పట్టించుకోదు. తనను గురించి ఆలోచించినట్టుగా ఒక్కరోజయినా అమ్మ తమ్ముణ్ణి గురించి ఆలోచించి ఉంటే? ఈ ఆలోచనలతో యశోదకు అన్నమే సయించలేదు. కంచంలో చెయ్యి కడుక్కొని లేచి పోయింది.

* * *

సాయంకాలం అయిదు గంటలు కాగానే ఆఫీసు లోంచి నెమ్మదిగా నడుస్తూ ఇంటికి బయలుదేరింది యశోద. "హల్లో! యశోదా! ఇంటికేనా!" అన్న ప్రకాశం పిలుపు విని ఉలిక్కిపడింది. క్షణంసేపు రాధాకృష్ణ అనుకుంది. తలెత్తి చూసేసరికి ప్రకాశం. కొరుక్కు తినేటట్టు చూచే ప్రకాశం చూపు, ఆ నవ్వు తను భరించలేదు. అతన్ని చూడగానే చాచి ఒక్క లెంపకాయ కొట్టాలనిపిస్తుంది. ఆలోచనల్లో మునిగి తనవైపు శూన్యంగా చూస్తున్న యశోదతో ప్రకాశం, "అలా కాఫీ తాగివద్దాము. రండి" అన్న మాటలు ఈ లోకంలోకి తీసుకువచ్చాయి. కళ్లు ఎత్తి ప్రకాశంవైపు అసహ్యంగా చూచింది. "నాకు ఇంటివద్ద పని ఉంది. వెళ్లాలి" అంటూ సమాధానానికి ఎదురు చూడకుండా నడిచిపోసాగింది. అయిన తన వెనక అతని వెటకారపు నవ్వు, "రాధాకృష్ణతో అయితే సినిమాలు, షికార్లు" అన్నమాటలు లీలగా వినిపించాయి.

ఏం మనిషి! పెళ్లి కూడా అయింది. కాని పెళ్లాన్ని పేరంటానికి అయినా పోనీయని ఈ ప్రబుద్ధుడికి తేరగా ఆడపిల్లలతో కాలక్షేపం కావాలి. పెళ్లాన్ని ఇలా సినిమాలకు, షికార్లకు తిప్పితే ఆవిడ ఎంత ఆనందిస్తుందో ఊహించడేమో! మరి చదువురాని పెళ్లాన్ని వెంటేసుకు తిరగడం నామోషి. చదువుకున్న పెళ్లాం కట్నం తేదు. డబ్బుకావాలి. ఏదో అవసరం తీరడానికి ఆడది ఉంటే సరి. ఛా! ఏం మనుషులు! వీళ్లే, తిరిగి కాస్త సోషల్‌గా ఉంటే చేసే వ్యాఖ్యానాలు ఇన్నీ అన్నీ కావు. అందుకే ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేసినా ఆడదాని జీవితం కత్తిమీద సాములాంటిది. రోజు రోజుకు కొత్త సమస్యలు పుడుతున్నాయి కాని తగ్గడం మాత్రం లేదు. ఎన్ని చట్టాలు ఉన్నా మనుష్యుల మనస్తత్వాల్ని మార్చగలవా? అలాగని అందరూ అసభ్యంగా ఉంటారనటానికి వీలులేదు. రాధాకృష్ణ ఎంత మంచివాడు! ఈ అయిదు సంవత్సరాల్లో ఒక్కసారైనా అతను అతి చనువు తీసుకోలేదు. నిన్న తనే నిగ్రహించుకోలేక అతని గుండెల్లో ముఖం దాచుకొని ఏడ్చింది. నిన్న జరిగిన సంగతంతా గుర్తురాగానే యశోద గుండె స్పందించడం ఆగిపోయినట్లనిపించింది. నిన్న రాధాకృష్ణ తనతో ఒక్కమాట కూడా చెప్పలేదు. అసలు ఈ రోజు ఆఫీసుకే రాలేదు అన్న విషయం గుర్తు రాగానే యశోద సర్వశక్తుల్ని ఎవరో బలవంతంగా లాక్కున్నట్లయింది. శరీరం అంతా విపరీతంగా చెమట పోయసాగింది. అయితే రాధాకృష్ణ ఈ ఊరు వదిలి వెళ్లిపోయాడన్న మాట! తనకు శాశ్వతంగా దూరమైపోయాడు. తను ఏది జరిగితే భరించలేనని ఇంతకాలం ఓపికపట్టిందో ఆ సంఘటన జరిగిపోయింది! శూన్యమైపోయిన తన హృదయాన్ని మళ్లీ నింపుకోవటానికి ఈ జన్మ చాలదు. అతని స్మృతిలో మాత్రమే ఇకముందు తన జీవితాన్ని గడపాలి. తను పిచ్చిది కనక తన చుట్టూ అల్లుకుపోయిన ఇన్ని సమస్యలను రాధాకృష్ణ విడతీయటానికి ఒప్పుకుంటాడనుకుంది. ఒకవేళ ఇష్టపడ్డా తను కూడా వీటిలో బంధించుకుపోతాననే భయం అతనికి కలిగే ఉంటుంది. ఇదే నిజం. ఆ ఊహ రాగానే యశోద కళ్లు నీళ్లతో నిండిపోయాయి. కానీ తన జీవితం నిస్సారంగా సాగిపోదు. అధోగతి పాలు కాకుండా తన కుటుంబాన్ని ఆదుకొని తన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. అదే తన విధి అనుకుంది మనస్సులో. ఈ ఆలోచన రాగానే గట్టిగా గాలి పీల్చుకొని ఒక నిట్టూర్పు విడవ గలిగింది యశోద.

* * *

ఇంటికి వచ్చిన యశోదకు వరండాలో తండ్రి కనపడలేదు. 'బహుశా ఎవరైనా వచ్చారేమో! వీధి గదిలోనుంచి మాటలు వినపడుతున్నాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది. తల్లి, చెల్లాయి గుడికి వెళ్లి ఉంటారు' అనుకొంది. గబగబా బట్టలు మార్చుకొని చల్లటి నీళ్ల స్నానంచేసింది. పెరటితోటలోని పారిజాతపు చెట్టుకింద మంచం వాల్చుకొని పడుకుంది. ఉదయం నుంచి విడదీయరాని సమస్యలతో అలసిపోయిన మెదడుకు కాస్త విశ్రాంతి దొరకగానే కునుకుపట్టింది. చల్లని మృదువైన స్పర్శ తన చెక్కిళ్లను తాకి నెమ్మదిగా బుజాలమీదనుంచి జారి మెడ క్రింది భాగాన్ని స్పృశించినట్లనిపించింది. క్షణకాలం శరీరం పరవశించింది. నెమ్మదిగా చేతిని మెడకిందికి పోనిచ్చి తడివి చూచుకుంది. పారిజాతం పువ్వు. చెట్టుమీదనుంచి రాలి ఉంటుంది. వాసన చూచి మళ్లా కళ్లు మూసుకుంది. 'భగవాన్! నన్నూ ఇలా నిరుపయోగంగా రాలిపోనివ్వకు. నా హృదయం నిండా పొంగిపొరలుతున్న ఈ అనురాగామృతాన్ని అందుకొని జీవన మాధుర్యాన్ని ప్రసాదించే హృదయేశ్వరుణ్ణి పొందేలా చెయ్యి. నాకూ కావాలి! తరించి ధన్యతచెందే జన్మ నాకూ కావాలి! దేవా! నాకూ కావాలి!' అనుకుంది. వెచ్చటి కన్నీటి బిందువులు యశోద కనుకొలకులనుండి జారి చుక్కలు



కమలకోమలి

చిత్రం—తపం (విజయవాడ-3)

చుక్కలుగా పడ నారంభించాయి.

అప్పటిదాకా వీధి హాలులో రామనాథంగారితో సమస్త విషయాలు మాట్లాడిన రాధాకృష్ణ యశోదను వెతుక్కుంటూ పెరట్లోకి వచ్చాడు. నెమ్మదిగా యశోదను లేపి తన చేతిని అందించాడు. మంచం దిగి నిలబడిన యశోద నడుము చుట్టూ తన చేతిని చుట్టి, "రా! మీ నాన్నగారికి నమస్కరిద్దాము!" అన్నాడు. ఆనందమో, ఆశ్చర్యమో చెప్పలేని విస్మయంతో యశోద కళ్లు క్షణం మెరిసి మూసుకున్నాయి. రాధాకృష్ణను పూర్తిగా ఆనుకొని నెమ్మదిగా అడుగులు వేస్తూ నడిచి పోయింది. ★